ఎండుతున్న పంట.. పశువులకు మేతాయే

హత్నూర, ఏప్రిల్ 2 : అప్పులు చేసి యాసంగిలో వరిపంట సాగు చేస్తే పొట్టదశకు వచ్చేసరికి పంటకు నీరందక పశువులకు మేతగా మారింది. యాసంగి సాగు ప్రారంభంలో బోరుబావుల్లో పుష్కలంగా నీరు ఉండటంతో కోటి ఆశలతో చేతిలో డబ్బులేక పోయినా అప్పుచేసి వరి పంటసాగు చేశారు. పంట ఏపుగా పెరిగి పొట్టదశకు వచ్చే సరికి భూగర్భ జలాలు తగ్గి బోరుబావుల్లో నీరుతగ్గడంతో వేసిన పంటలు కండ్ల ముందు ఎండిపోతున్నాయి. దీంతో అప్పులు చేసి సాగుచేస్తే ఎలాతీర్చాలో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నామని రైతన్నలు వాపోయారు. హత్నూర మండలంలో వందల ఎకరాల్లో పంట ఎండిపోవడంతో ప్రభుత్వం అదుకోవాలని కోరారు.

సికింద్లాపూర్ శివారులో ఎండిన పంటను మేస్తున్న పశువులు,మేకలు

సన్నబియంపై అధికారులను నిలదీసిన ప్రజలు

ఝరాసంగం, ఏప్రిల్ 2 : అందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెప్పి కేవలం రేషన్ కార్డు ఉన్నవారికే పంపిణీ చేయడం ఏమిటని తహసీల్దార్ తిరుమల రావును ప్రజాపాలన గ్రామ సభల్లో కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్జీదారులు నిలదీశారు. బుధవారం మండల పరిధిలోని కుప్పానగర్‌లో పౌరసరఫరాల శాఖ ద్వారా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సొసైటీ చైర్మన్ గౌసోద్దీన్ పారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం 30 లక్షల మందికి కొత్త రేషన్‌కార్డులు జారీ చేశామంటూ బ్యానర్లో ఉంది కదా మరి మాకేందుకు కొత్తరేషన్‌కార్డులు ఇవ్వలేదం టూ అధికారులను ప్రశ్నించారు. నాయబ్ తహసీల్దార్ యాసీన్‌ఖాన్, ఆర్ఐ రామరావు, మండలాధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, మాజీ ఎంపీటీసీ శంకర్, మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ తిరుమలరావును నిలదీస్తున్న ప్రజలు

లబ్ధిదారులు వినియోగించుకోవాలి

కోహీర్, ఏప్రిల్ 2 : నిత్యవసర సరుకుల దుకాణంలో అందించే సన్నబియ్యాన్ని రేషన్ కార్డుదారులందరూ వినియోగించుకోవాలని సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఆర్డీ వో రాంరెడ్డి కోరారు. బుధవారం కోహీర్ పట్టణంతో పాటు దిగ్వాల్‌లోని రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. తహసీల్దార్ బాల శంకర్, వరప్రసాద్, బస్వరాజ్, సత్యనారాయణ, రామలింగారెడ్డి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో..

కొండాపూర్, ఏప్రిల్ 2 : మండల పరిధిలోని హరిదాస్‌పూర్‌లో తహసీల్దార్ ఎస్తేర్ అనిత ప్రారంభించారు. ఆత్మకమిటీ చైర్మన్ వై ప్రభు, మాజీ సర్పంచ్ నర్సింహులు, జయరామ్, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, మండలాధ్యక్షుడు అశోక్, నాయకులు కిషన్, గోపాల్ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 2 : పట్టణంలోని శాంతినగర్‌లోని 28వ వార్డులో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి లతో కలిసి ప్రారంభించారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తోపాజి అనంత కిషన్, మాజీ కౌన్సిలర్లు ఉమా మహేశ్వరి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జహీరాబాద్, ఏప్రిల్ 2 : ఆన్‌లైన్ గేములు, బెట్టింగ్‌యాప్‌లు, సైబర్ నేరాలపై యువకులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని న్యాల్‌కల్ మండలం హద్నూర్ పోలీసులు సూచించారు. బుధవారం స్థానిక గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో గ్రామ ప్రజలు, యువకులు, ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ అబ్నీయర్ సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 2 : విద్యార్థులు, యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి సీఐ రవి పిలుపునిచ్చారు. స్థానిక తారా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు 2,3,4ల ఆధ్వర్యంలో మండల పరిధిలోని కలబ్‌గూర్ చింతలపల్లి, అంగడిపేట దత్త గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక శీతాకాల శిబిరాల్లో భాగంగా బుధవారం ఆరో రోజు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ రవి మాట్లాడుతూ సైబర్ నేరాలపై యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎస్సై సర్దార్, పోలీసు అధికారులు రాజలింగం, వెంకటేశ్, ఉదయ్, శిరీష, భవానీ, మహేశ్, మహిళా న్యాయ సేవ సదన్ ప్రధాన నిర్వాహకులు కృపా వర్మ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయ్య కుమార్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరంలో ఉచిత వైద్య శిబిరాలు

తారా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు 2,3,4ల ఆధ్వర్యంలో మండల పరిధిలోని కలబ్‌గూర్ చింతలపల్లి, అంగడిపేట దత్త గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక శీతాకాల శిబిరాల్లో భాగంగా బుధవారం ఉచిత వైద్య శిబిరాలను ఆయా గ్రామాల్లో నిర్వహించారు. దంత సమస్యలు ఉన్న వారికి వైద్య సదుపాయాలు కల్పించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న మెడికల్ సిబ్బంది

57వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న బొంతపల్లి అఖిలపక్ష నాయకులు

గుమ్మడిదల, ఏప్రిల్ 2 : డంపింగ్ యార్డుతో మా బతుకులను బుగ్గి చేయొద్దని బాధిత గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలో ని పేరా నగర్ సమీపంలో జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన డంపింగ్‌యార్డు నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బాధిత గ్రామ ప్రజలు చేస్తున్న రిలే నిరాహార దీక్ష 57వ రోజుకు చేరుకుంది. బుధవారం గుమ్మడిదల చౌరస్తాలో చేస్తున్న రి లే నిరాహార దీక్షలో బొంతపల్లి, వీరన్నగూడెం గ్రామాలకు చెందిన అఖిలపక్ష నాయకులు దీక్షలో పాల్గొన్నారు. వీరికి గుమ్మడిదల నాయకులు సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారా నగర్ గ్రా మాల్లో 57వ రోజు రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. జేఏసీ నాయకులు చిమ్ము ల గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు నరసింహారెడ్డి, సురభి నాగేందర్ గౌడ్, ఆలేటి నవీనా శ్రీనివాస్ రెడ్డి, పొన్నబోయిన మమత వేణు, తులసీదాస్, దోమడుగు బాల్ రెడ్డి, జేఏసీ నాయకులు దేవేందర్ రెడ్డి, మద్దులబాల్ రెడ్డి, లక్ష్మీనారాయణ, చక్రపాణి, గటాటి రమేశ్, వినోద్, జగ్గారెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, సుధాకర్ రెడ్డి, చంద్రారెడ్డి, భిక్షపతిరెడ్డి, సంజీవరెడ్డి, బొంతపల్లి వీరభద్ర హమాలీ యూనియన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అందోల్, ఏప్రిల్ 2 : మండల పరిధిలోని అన్నాసాగర్ మూలమలుపు వద్ద బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో యువకుడు మృతి చెందగా, మరో యువకుడు గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అందోల్ (కుమ్మరిగూడెం)కు చెందిన మద్దూరి అనిల్ (25) కుమ్మరి అనిల్ ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై కిచ్చన్నపల్లికి వెళ్తున్నారు. ఇదే సమయంలో నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో బైక్ బస్సు కిందకు దూసుకు వెళ్లడంతో మద్దూరి అనిల్ ఘటన స్థలంలోనే మృతి చెందగా, కుమ్మరి అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాండు తెలిపారు.

నారాయణఖేడ్ : సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

సర్వాయి పాపన్నకు నివాళి

సంగారెడ్డి కలెక్టరేట్ : సర్వాయి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, తదితరులు

బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని బుధవారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పాపన్నను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

-సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, ఏప్రిల్ 2

సంగారెడ్డి కలెక్టరేట్ : సంగారెడ్డిలోని తన నివాసంలో పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, నేతలు

వట్‌పల్లిలో సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళుల ర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని ఆపాలి

కంది, ఏప్రిల్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన వీడి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కంది బీఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేశ్ నాయక్ అన్నారు. హైదరాబాద్ సెంట్ర ల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని అమ్మాలని చూడటం, జేసీబీలతో పర్యావరణాన్ని నాశనం చేయడం తగదన్నారు. హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతుగా నిలిచిన తనను అరెస్టు చేయడంలో అంతర్యామేమిటని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులకు బయపడేది లేదని హెచ్‌సీయూ విద్యార్థుల పోరాటానికి అండగా ఉంటామని హెచ్చరించారు.

కంగ్టిలో..

కంగ్టి, ఏప్రిల్ 2 : ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను అమ్ముకోడానికి ప్రయత్నిస్తుందని, ఈనిర్ణయాన్ని కాంగ్రెస్ ప్ర భుత్వం మానుకోవాలని కంగ్టి మండల తెలంగాణ జాగృతి అధ్యక్షుడు కురుమ జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం కంగ్టి మండలంలోని తడ్కల్‌లో పిట్లం-కంగ్టి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు సేవ్ హెచ్‌సీయూ అంటూ ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకు లు నవనాథ్‌పాటిల్, మంగశ్‌పాటిల్, అభిషేక్, మహే శ్, లాల్‌కుమార్ పాల్గొన్నారు.

అందోల్‌లో..

అందోల్, ఏప్రిల్ 2 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రభు త్వం వేలంపాట వేయడం విరమించుకొని భూములను రక్షించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్‌పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం జోగిపేటలో మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భూముల వేలాన్ని అడుకున్నవారు ఇప్పుడూ అదే భూములను వేలం పాటలో పెట్టడం విడ్డూరంగా ఉన్నదన్నారు. నాయకులు సాయిలు చారి, దేవిసింగ్, మనోహర్ తదితరులు ఉన్నారు.

ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న జాగృతి నాయకులు

మిషన్ భగీరథ కార్మికుల ఆందోళన

జహీరాబాద్, ఏప్రిల్ 2 : తమకు వేతనాలను చెల్లిస్తేనే మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రాఘవపూర్ మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికులు స్పష్టం చేశారు. వేతనాల కోసం తాగునీటి సరఫరాను నిలిపివేసి చేపడుతున్న కార్మికుల ఆందోళన బుధవారం రెండో రోజుకు చేరుకున్నది. దీంతో జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత మిషన్ భగీరథ అధికారులు కార్మికులకు సకాలంలో వేతనాలను చెల్లించకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కార్మికులకు ఎనిమిది నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలను చెల్లించడం లేదు. మార్చి 28వ తేదీలోగా చెల్లిస్తామని సంబంధిత మిషన్ భగీరథ కార్మికులు, కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. తమకు ఇచ్చిన మాట ప్రకా రం వేతనాలను చెల్లించకపోవడంతో ఆందోళనకు చేపడుతున్నామని చెప్పారు. వేతనాల కోసం ఆందోళన చేపడుతున్న కార్మికులతో సంబంధిత జిల్లా అధికారులు ఫోన్ లో మాట్లాడారు. ఈ నెల 11వ తేదీలోగా వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా సంబంధిత మిషన్ భగీరథ జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకుని తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, ఆయా మండలాల్లోని గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రాఘవపూర్ మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ వద్ద ఆందోళన చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాన్ని వెంటనే చెల్లించాలి

సదాశివపేట, ఏప్రిల్ 2 : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల మూడు నెలల పెండింగ్ వేతనాన్ని వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఉపాధిహామీ పని ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రెండు నెలల బకాయిలు వెంటనే ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు మంచినీళ్లు, టెంట్లు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమకూర్చాలన్నారు. వారం రోజుల్లో కూలీల బకాయిలు ఇవ్వకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పద్మమ్మ, మధు, సుభాష్, అంజయ్య, గాలయ్య, సరిత, వాహేదాబీ, యాదమ్మ, మంజుల, రిజ్వాన, వీరన్న, కిష్టయ్య, గిరిజ, మహేందర్, శ్రీనివాస్, రాములు, నాగలక్ష్మి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు

హత్నూర, ఏప్రిల్ 2 : తాగునీటి సమస్య పరిష్కారానికి హత్నూర మండలం సిరిపుర శివారులోని మిషన్‌భగీరథ వాటర్‌సంపు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్ అధికారులు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో మార్చి 12న 'నిరుపయోగంగా వాటర్‌సంపు' అని వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు వాటర్ సంపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. వాటర్‌సంపు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్‌వైర్లు బిగించారు. దీంతో త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్ బిగించి విద్యుత్ కనెక్షన్ ఇవ్వనుండటంతో నిరుపయోగంగా ఉన్న వాటర్‌సంపు ఉపయోగంలోకివచ్చి సమీపగ్రామాల ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కానున్నది. పలుగ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సిరిపుర శివారులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేసిన దృశ్యం

తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేయాలి

పటాన్‌చెరు, ఏప్రిల్ 2 : తప్పులు లేని ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు రాజకీయ పార్టీలు సాయం చేయాలని పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు అన్నారు. మంగళవారం పటాన్‌చెరు తహసీల్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేసే ప్రక్రియను చేపట్టామన్నారు. దీనికి అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. నాయకులు కొల్కూరి నరసింహారెడ్డి, శివకుమార్, ప్రశాంత్ కుమార్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు సహకరించాలి

నారాయణఖేడ్, ఏప్రిల్ 2 : ఓటరు నమోదు ప్రక్రియకు అన్ని పార్టీల ప్రతినిధులు సహకరించాలని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి కోరారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌నాయక్, మల్‌గొండ ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పార్కులు బాగుచేయించాలని వినతి

పటాన్‌చెరు, ఏప్రిల్ 2 : జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ కలిసి వినతి పత్రం అందజేశారు. బుధవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని పటాన్‌చెరు కార్పొరేటర్ కలిసి గాంధీ థీమ్ పార్క్, పక్కనే ఉన్న టువంటి ట్రయాంగిల్ బిట్ 2021లో జీహెచ్ఎంసీ నిధులు రూ. మూడు కోట్లతో నిర్మించారని గుర్తు చేశారు. ఇప్పుడు పార్క్ నిర్వహణ మరిచిపోవడంతో ఫౌంటేన్ పనిచేయడం లేదని, పార్కు నిరుపయోగంగా మారిందని తెలిపారు. వెంటనే స్పందించి పార్క్‌ను ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని కార్పొరేటర్ కోరారు. జేపీ కాలనీలో నూతన సీసీ రోడ్లు, డివిజన్ పరిధిలోని యాదవ సంఘం శ్మశానవాటిక వద్ద అప్రోచ్‌రోడ్డు రిటైనింగ్ వాల్ నిర్మాణం, చితి మంటపాల చుట్టూ సీసీ రోడ్డు, ప్లాట్ ఫారం నిర్మాణం ఇతర కాలనీల్లో నూతనంగా సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు.

జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

జిన్నారం, ఏప్రిల్ 2 : జిన్నారం మండలం నల్తూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా లైబ్రరీ పుస్తకాలను పం పిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రథమ్ సంస్థ సమన్వయకర్త సుధాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రథమ్ సంస్థ అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. జిల్లా సమన్వయకర్త రామలక్ష్మి, మండల కో-ఆర్డినేటర్ సంగీత, పాఠశాల హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండాపూర్ తహసీల్దార్ ఎస్తేర్ అనిత బదిలీ

కొండాపూర్,ఏప్రిల్ 2 : కొండాపూర్ మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్తేర్ అనిత బుధవారం బదిలీ అయ్యారు. వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరులో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరులో తహసీల్దార్ అనిత, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్ అవకతవకలు పాల్పడ్డారన్నారు. వారసత్వ పర్యవేక్షణ నిర్లక్ష్యం కారకణంగా తహసీల్దార్ ఎస్తేరు అనితను నారాయణఖేడ్ ఆర్డీవో కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా బదిలీ చేస్తూ కలెక్టర్ క్రాంతి వల్లూరి ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ఐ తప్పుడు పంచానామ నివేదిక ఆధారంగా తహసీల్దార్ వారసత్వ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసినందున ఈ నిర్ణయం తీసుకునట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విషయమై బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపిన కలెక్టర్ ఆర్ఐని సస్పెన్షన్ చేస్తూ, తహసీల్దార్‌ను బదిలీ చేస్తు ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

తహసీల్దార్ ఎస్తేర్ అనిత

కల్చరల్ ఫెస్ట్ అదుర్స్..

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 2 : విద్యార్థుల కేరింతలతో కల్చరల్ ఫెస్ట్ అదిరింది. స్థానిక తారా ప్రభుత్వ కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్ వేడుకలు అంబరాన్నంటాయి. విద్యార్థుల ఈలలు, కేరింతలతో ఇండోర్ స్టేడియం మార్మోగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన, క్యాట్ వాక్, నాటకల ప్రదర్శనలతో అందరినీ ఆకర్షించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షుడు డాక్టర్ కూన వేణు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు. వాణిజ్య విభాగాధిపతి జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థినీల నృత్య ప్రదర్శన

వివాహితపై అత్యాచారయత్నం

చౌటకూర్, ఏప్రిల్ 2 : పొలంలో పని ఉన్నదని నమ్మబలికి వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడి కత్తితో దాడి చేసిన సంఘటన సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం అడవిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. పుల్క ల్ మండలంలోని గొంగ్లూరు గిరిజన తండాకు చెందిన రమావత్ అనితను మిన్‌పూర్ గిరిజన తండాకు చెందిన సురేశ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఇద్దరు పిల్లలు పుట్టాక వారి మధ్య గొడవలు జరగడంతో ఇద్దరు విడిపోయారు. అనిత ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటి వద్ద ఉంటున్నది. గుర్తు తెలియన వ్యక్తి పొలంలో పని ఉన్నదని, కూలీ ఇస్తానంటూ నమ్మబలికి చౌటకూర్‌కు రావాలని చెప్పడంతో ఆమె బుధవారం అక్కడికి వెళ్లింది. అప్పటికే అక్కడ ఉన్న సదరు వ్యక్తి తన మోటరు బైక్‌పై ఎక్కించుకొని బొమ్మారెడ్డిగూడెం అడవిలోకి తీసుకువెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. అందుకు ప్రతిఘటించగా, కత్తితో దాడి చేసి పరారయ్యాడు. ఆమె రోడ్డుపైకి చేరుకోవడంతో చుట్టుపక్కల వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మహిళలను గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ పరామర్శించారు. ఈ ఘటనపై ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

సదాశివపేట, ఏప్రిల్ 2 : మండల పరిధిలోని నందికందిలో గల అంగన్‌వాడీ కేంద్రం-2ను రీజినల్ డైరెక్టర్ మోతీ బుధవారం సందర్శించారు. ప్రీ స్కూల్ యాక్టివిటీ, యోగా, మెడిటేషన్ గురించి వివరించారు. బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ లలితకుమారి, సీడీపీవో చంద్రకళ, సూపర్‌వైజర్ ఉమారా ణి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, గీత, శ్రీలత, సునిత, చిన్నారులు పాల్గొన్నారు.

మారిన వ్యవసాయాధికారుల ఫోన్ నంబర్లు

జహీరాబాద్, ఏప్రిల్ 2 : జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల వ్యవసాయాధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి తెలిపారు. జహీరాబాద్ ఏడీఏ ఫోన్ నంబర్ 8977754553, జహీరాబాద్ పట్టణ వ్యవసాయాధికారి ఫోన్ నంబర్ 8977754554, ఝరాసంగం మండల వ్యవసాయాధికారి ఫోన్ నంబర్ 8977754657, కోహీర్ మండల వ్యవసాయాధికారి 8977754658, జహీరాబాద్ మండల వ్యవసాయాధికారి 8977 754667, న్యాల్‌కల్ మండల వ్యవసాయాధికారి 8977754660, మొగుడంపల్లి మండల వ్యవసాయాధికారి ఫోన్ నంబర్ 8977 754659గా మారినట్లు పేర్కొన్నారు. ఆయా మండల వ్యవసాయాధికారుల మారిన ఫోన్ నంబర్లను మండలాల పరిధిలోని అధికారులు, నాయకులు, రైతులు గమనించాలని సూచించారు.

ఎస్‌జీటీని సస్పెండ్ చేసిన డీఈవో

రామచంద్రాపురం, ఏప్రిల్ 2 : ఆర్సీపురం డివిజన్‌లోని మయూరినగర్‌కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు బుధవారం సందర్శించారు. డీఈవో పాఠశాలను సందర్శిస్తున్న నేపథ్యంలో పాఠశాలకు చెందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు సుజాత పాఠశాలకు ఉదయం 8.45 గంటలకు వచ్చారు. సదరు ఉపాధ్యాయురాలుపై అధికారుల నుంచి ఎటువంటి మందస్తు అనుమతి, సమాచారం ఇవ్వకుండా డిసెంబర్ 2024 నుంచి ప్రైవేట్ వ్యక్తిని పాఠశాలలో అనధికారికంగా టీచర్‌గా నియమించుకొని పాఠశాలను నడుపుతున్నారు. ఈ విషయం డీఈవో వెంకటేశ్వర్లు దృష్టికి రావడంతో విధులను నిర్వహించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయురాలిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

బస్‌షెల్టర్ ప్రారంభం

గుండ్లమాచునూర్‌లో బస్‌షెల్టర్ ప్రారంభిస్తున్న పరిశ్రమ యాజమాన్యం

హత్నూర, ఏప్రిల్ 2 : హత్నూర మండలం గుండ్లమాచునూర్ బస్ స్టేజీ వద్ద నిర్మించిన బస్‌షెల్టర్ బుధవారం ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యార్థం హానర్ పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో విద్యాభివృద్ధికి కృషిచేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు కృషిచేయాలని కోరారు. సీఎస్ఆర్ ప్రతినిధులు సుధాకర్, అరుణ్ కుమార్‌రెడ్డి, పరిశ్రమ జీఎం వేనుగోపాల్ రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ సుభాష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన కమిషనర్

అమీన్‌పూర్, ఏప్రిల్ 2 : అమీన్‌పూర్ బంధం కొమ్ము నుంచి చక్రపురి కాలనీ బాచ్‌పల్లికి కలిపే రహదారి పనులు కొనసాగుతున్న సందర్భంగా బుధవారం అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరతగతిన రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రహదారి నిర్మాణంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా మా దృష్టికి తీసుకువస్తే అంతరాయం కలుగకుండా చొరవ చూపుతానన్నారు. అమె వెంట అధికారులు కాంట్రాక్టర్ ఉన్నారు.

ఘనంగా ఈద్ మిలాప్

మంత్రి దామోదర్‌కు పూలబొకే అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ అసాద్‌పటేల్

మునిపల్లి, ఏప్రిల్ 2 : మండలంలోని కంకోల్ గ్రామ శివారులోని అభిషేక్ గార్డెన్‌లో అందోల్ నియోజకవర్గ స్థాయి ఈద్ మిలాప్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కుస్తీ పోటీలు

కంగ్టి, ఏప్రిల్ 2 : కంగ్టి మండల పరిధిలోని బాన్సువాడలో బుధవారం బారడీపోచమ్మ జాతరోత్సవంలో భాగంగా కుస్తీపోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతిని అందజేశారు.